క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



రమేష్

కదిరి టౌన్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 22, 23 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి ఫెడరేషన్ కప్ బాడీ బిల్డింగ్ పోటీలకు కదిరి లోటస్ జిమ్ నిర్వాహకుడు రమేష్ ఎంపికైనట్లు రాష్ట్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రమేష్ మాట్లాడుతూ జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం అర్బన్: స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని ఆర్డీఓ మహేష్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం లింగ నిర్ధారణ, అబార్షన్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లను తరచూ వైద్యాధికారులు తనిఖీలు చేయాలన్నారు. దీనిపై ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్, డిప్యూటీ డెమో అధికారి బాబా ఫక్రుద్దీన్, వైద్యులు వెంకటేశ్వర్లు, వైష్ణవి, సురేష్ నాయక్, రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, అన్నమయ్య సేవా మండలి సభ్యులు పోతిరెడ్డి, అయ్యప్పస్వామి సేవా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న దోలా రామచంద్రారెడ్డి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ దోలా రామచంద్రారెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గంగినేపల్లిలో మంగళవారం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ చేసే ప్రతి కార్యక్రమం ప్రజలకు తెలిసేలా గ్రామస్థాయి నాయకులు పని చేయాలన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. పార్టీ పరంగా సమస్యలు ఎదురైతే నాయకులంతా కలిసి పరిష్కరించుకోవాలని సూచించారు.


'పీసీఎంఆర్' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న పీసీఎంఆర్ పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబరిచిందని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నాగలూరు వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో మంగళవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని అభినందించారు. పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని ఉషశ్రీ విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన స్టార్ జూనియర్ లెవెల్ 3వ రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానం సాధించిందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమినాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ప్రశాంతినిలయం ముఖద్వారం వద్ద అలంకరించి సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగుతూ ఊరేగింపుగా ప్రశాంతినిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్యపేట, పెద్దబజార్ మీదుగా ప్రశాంతి నిలయానికి చేర్చారు. ఈ ఉత్సవంలో విదేశీ భక్తులు కూడా గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'మాకు స్టాకు పాయింట్ నుంచే తూకాలు తక్కువగా వస్తున్నాయి. మేము ఏం చేస్తాం. అందరికీ ఇవ్వాలి కదా? అందుకే మీకు 20 కేజీలకుగాను 4 కేజీలు పట్టుకొని ఇస్తున్నాం. అంత మాత్రానికి పెద్దగా మాట్లాడుతున్నారు...కాదు కూడదంటే ఇచ్చిన బియ్యం వెనక్కు వేసి మీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోండి' అని డీలర్లు లబ్ధిదారులపై బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో కార్డుదారులు వారి మాటలకు ఎదురుచెప్పకుండా తూకం వేసి ఇచ్చిన బియ్యాన్ని తీసుకెళ్తున్నారు.

పేదల బియ్యం.. డీలర్ల భోజ్యం



- 20 కిలోలకుగాను 16 కిలోలే పంపిణీ
- స్టాకు పాయింట్‌పై నెపం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కార్డు దారులు

ధర్మవరం రూరల్: పేదలకు చౌక ధరల దుకాణాల నుంచి అందించే బియ్యం సరఫరాలో దోపిడీ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డీలర్‌షిప్పు కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఆదాయ మార్గంగా భావిస్తుండడంతో డీలర్‌షిప్ కోసం ఎంతో మంది ప్రయత్నాలు చేశారు. అయితే డీలర్‌షిప్ దక్కించుకున్న వారు పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయకుండా కేవలం ఆదాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే రెండు మూడు కోటాలు సక్రమంగా ఇచ్చిన వారు తర్వాత కోతలు మొదలుపెట్టారు.

లబ్ధిదారుల ఆందోళన

నడిమిగడ్డపల్లి, ఏలుకుంట్ల గ్రామాల్లో బియ్యాన్ని తక్కువగా ఇస్తున్నారని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 20 కేజీలు ఇవ్వాల్సిన వారికి 16 కేజీలు, 25 కేజీలు ఇవ్వాల్సిన వారికి 18 కేజీలు, అలాగే 5 కేజీలు ఇవ్వాల్సిన వారికి మూడు, నాలుగు కేజీలు మాత్రమే ఇవ్వడంపై లబ్ధిదారులు బహిరంగంగానే డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. అయితే ఏలుకుంట్లలో పలువురు లబ్ధిదారులు బియ్యం వెనక్కిచ్చినట్లు తెలుస్తోంది. ధర్మవరం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలతో పాటు తండాలు ఎక్కువగా ఉన్నాయి. చాలా మంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. రేషన్ సరుకుల కోసం ప్రతి నెలా వారు గ్రామాలకు వచ్చి వెళ్తుంటారు. అలాంటి వారికి తూకాల్లో తక్కువ రావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బియ్యంతో పాటు కంది బేడలు, నూనె, చక్కెర, బెల్లం, రాగులు, జొన్నలు ఇవ్వగా కూటమి ప్రభుత్వంలో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నట్లు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నడిమిగడ్డపల్లిలో 20 కేజీలకుగాను 16 కేజీలే ఇచ్చారని చూపుతున్న లబ్ధిదారులు

ధర్మవరం నియోజకవర్గంలోని లబ్ధిదారులు, రేషన్ షాపుల వివరాలు..

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డుల సంఖ్య
ధర్మవరం, రూరల్	113	52,459
బత్తలపల్లి	41	12,548
తాడిమర్రి	31	12,827
ముదిగుబ్బ	54	19,257

తప్పెవరిది?

డీలర్లేమో తమకు స్టాకు పాయింట్ నుంచి ప్రతి నెలా తక్కువ తూకాలు వస్తున్నాయంటున్నారు. స్టాకు పాయింట్ అధికారులేమో కచ్చితమైన తూకాలతో గ్రామాలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. అయితే రేషన్ సరుకులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? లేదా అనే దానిపై అధికారులు ఎక్కడా తనిఖీలు చేసినట్లు కనిపించడం లేదు.

స్టాక్ పాయింట్ దాటితే మాకు సంబంధం లేదు

డీలర్లకు కచ్చితమైన తూకాలతో రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నాం. బియ్యాన్ని బస్తాలతో కాకుండా క్వింటాళ్ల ప్రకారం డీలర్లకు సరఫరా చేస్తాం. తూకాలు తక్కువ ఇస్తున్నారని మీకు చెప్పడమే కాని నా దగ్గర వారు చెప్పడం లేదు. స్టాక్ పాయింట్ దాటితే మాకు ఎటువంటి సంబంధం లేదు. నాపై ఒత్తిళ్లు వున్న మాట వాస్తవమే. డీలర్లు మాపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారో నాకు తెలియడం లేదు.

– ప్రసన్నకుమార్, ధర్మవరం స్టాక్ పాయింట్ ఇన్‌చార్జ్

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

అమడగూరు: రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అమలు చేసే పథకాల్లో అక్రమాలు జరగకుండా ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రైతు పేరు, గ్రామం పేరు, ఆధార్, భూమి పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్‌ను తీసుకెళ్తే వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా మీ వివరాలను నమోదు చేసి 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తారన్నారు.

తాడిమర్రి: మండలంలోని రైతులు రైతు విశిష్ట సంఖ్య(ఫార్మర్ యూనిక్ ఐడీ) కోసం రిజిస్టర్ చేసుకోవాలని ఏఓ రమాదేవి సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, యాంత్రీకరణ రాయితీలు అందాలంటే ప్రతి ఒక్కరూ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్ కార్డుకు లింకైన ఫోన్ నంబర్‌తో ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించాలని సూచించారు.

బియ్యం గోడౌన్ తనిఖీ



తూకాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సువర్ణ

ఓడీ చెరువు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బియ్యం గోడౌన్‌ను ఆర్‌డీఓ సువర్ణ మంగళవారం తనిఖీ చేశారు. సరుకుల నిల్వ, తూకాలను స్వయంగా పరిశీలించారు. అంతకుముందు ఆర్డీఓ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. భూముల రీసర్వే, ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతులపై తహసీల్దార్ అనంతాచారితో మాట్లాడారు. గోడౌన్ స్టాకిస్ట్ మనోహర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి

ఎన్పీకుంట: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన హామీల అమలుకు ఈ నెలలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ఉపాధ్యాయులతో సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ వేతన సవరణ కమిటీని నియమించి మంచి ఫిట్మెంట్‌తో పీఆర్సీ ఇస్తామని, వేలకోట్ల బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని, అలాగే సకాలంలో డీఏలు చెల్లిస్తామంటూ ప్రకటించి, ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరి ఏడు నెలలు గడుస్తున్నా చెప్పిన ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో సంఘం పక్షాన కార్యాచరణ ప్రకటించి ఉద్యమ దారి పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్టీయు గౌరవాధ్యక్షుడు రామాంజులుయాదవ్, జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, మురళీ, వెంకటరమణారెడ్డి, సందీప్, రహీం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: కదిరి డివిజన్ పరిధిలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్స్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న వారు మంగళవారం ఎన్జీఓ హోంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఇటీవల కాలంలో కూటమి ప్రభుత్వం మంత్రి మండలి సమావేశంలో గత ప్రభుత్వం తీసుకువచ్చి ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయం తీసుకుందని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి జగన్మోహన్, ముస్తక్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని కేటగిరీల్లోనూ ఖాళీలు భర్తీ చేయాలి



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధక్షుడు రమణ

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీలోని అన్ని కేటగిరీల్లోనూ ఖాళీలను భర్తీ చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధక్షులు ఎన్వీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సాయి ఆరామంలో కడప జోనల్ సెక్రటరీ శ్రీరాం నాయక్ అధ్యక్షతన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా ద్వితీయ మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీ రమణ, మహా సభల పరిశీలకులు వినోద్, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, డిపో గౌరవాధక్షులు రామ్‌లక్ష్మణ్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలోకి విలీనమై నాలుగేళ్లవుతున్నా ఏ క్యాడర్‌లోనూ ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. 2017 పే స్కేల్, అరియర్స్ వెంటనే చెల్లించాలని, సిబ్బంది కొరత ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ ముత్యాలప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి, ఉపాధక్షులు ప్రభాకర్‌రెడ్డి, డిపో అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రీజనల్ చైర్మన్‌గా ముత్యాలప్ప

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ చైర్మన్‌గా మూడోసారి ముత్యాలప్ప ఏకగ్రీవంగా ఎంపికయ్యాడు. పుట్టపర్తిలో మంగళవారం ద్వితీయ మహాసభల్లో ముత్యాలప్పను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన్ను తోటి కార్మికులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్



మాట్లాడుతున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక సాయి ఆరామంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు అనంతరం సాయి ఆరామం నుంచి గణేష్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ రోడ్డు భద్రత నియామలు పాటించాలన్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో ప్రతి ఆటో డ్రైవర్ పోలీస్ శాఖ జారీ చేసిన నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిఐలు సురేష్, నరేంద్రరెడ్డి, ఇందిర,రూరల్ ఎస్ఐ లింగన్నతోపాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం

ఎన్పీకుంట: అతివేగం ప్రమాదకరమని వాహనదారులు వాహనాలను అత్యంత జాగ్రత్తగా నడపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక నాగార్జున ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు రోడ్డు భద్రత, రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాష్ రైడింగ్, మద్యం సేవించి వాహనాల నడపటం, జిగ్ జాగ్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మణికంఠ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

చెన్నేకొత్తపల్లి: మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని రామగిరి సీఐ శ్రీధర్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా ఎన్ఎస్‌గేట్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సు తప్పక ఉంచుకోవాలన్నారు.

మీకు చేతనైతే నా జోలికి రండి

- అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'మీకు చేతనైతే నా జోలికి రండి. ఆ తర్వాతే మా కార్యకర్తల జోలికి వెళ్లండి. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదు. రైతు ప్రయోజనాలను తుంగలో తొక్కి వారి శవాలపై దోపిడీ చేయాలని చూస్తే అడ్డుకుని తీరుతాం' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం అనంతపురం శివారులోని తన క్యాంపు కార్యాలయంలో అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదన్నారు. చంద్రబాబు ఏమీ చేయలేరని ప్రజలకు అర్థమైందన్నారు.'తల్లికి వందనం', '18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1,500', 'బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే సామాజిక పింఛన్లు', 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం', 'రైతులకు రూ.20 వేలు', '9 గంటల నాణ్యమైన కరెంటు' ఇలా ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు.

మీ ఇంట్లో తిని పార్టీ కోసం పని చేశారు

మీ ఇంట్లో తిని పార్టీ కోసం పని చేశారని, మీకు రుణపడి ఉంటానని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం జగనన్న పెట్టిన పార్టీలో అందరూ కలిసికట్టుగా ఉందామన్నారు. నా కట్టె కాలేంతవరకూ జగన్‌మోహన్‌రెడ్డితోనే పని చేస్తానన్నారు. తాను బతికున్నంతకాలమూ పరిటాల కుటుంబాన్ని వ్యతిరేకిస్తూనే ఉంటా తప్ప రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వ్యక్తులుగా ఎవరినీ వ్యతిరేకించనని, ఉద్దేశాలు, సిద్ధాంతాలు, వారి విధానాలు తప్పయితే వ్యతిరేకిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా చూసినా అక్రమంగా మట్టి తోలుతూ గుట్టలను గుండు కొడుతున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో వరుసగా మూడేళ్లు పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామని, ఈరోజు పేరూరు డ్యాం కింద పెన్నానది నుంచి రోజూ కర్ణాటకకు ఇసుకను తరలిస్తున్నారన్నారు.

సంక్షిప్త సమాచారం

శ్రీరంగరాజన్‌పై దాడి అమానుషం

కదిరి టౌన్: చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి అమానుషమని ఖాద్రీ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనరసింహాచార్యులు, పార్థసారథి ఆచార్యులు, కుమార్‌స్వామి అన్నారు. రంగరాజన్‌పై దాడిని వీహెచ్‌పీ, ధార్మిక సంస్థల సభ్యులు, బీజేపీ మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. దీనిపై విచారణ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఖాద్రీ ఆలయం ముందు నిరసన తెలిపారు.

'ఘంటసాల'కు ఘన నివాళి

కదిరి టౌన్: అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతిని పట్టణంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. హ్యూమన్ వ్లూటి, ముఖమురళి కళారత్న కొమరవోలు శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అందరినీ అలరించింది. ఖాద్రీ ఆలయం మాజీ పాలక మండలి సభ్యులు ఉమామహేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి చక్రస్నానం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటలోనున్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులో మంగళవారం స్వామి ఉత్సవ మూర్తులకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి చక్రస్నానాన్ని తిలకించారు. అనంతరం స్వామిని పల్లకీపై ఊరేగించారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బత్తలపల్లి చెరువును నింపండి

బత్తలపల్లి: ధర్మవరం బ్రాంచ్ కెనాల్ నుంచి పీఏబీఆర్ నీరు వస్తున్న నేపథ్యంలో బత్తలపల్లి చెరువును ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్‌బాబు, జేఈ బసవరాజు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక రైతులు అధికారులను కలిసి చెరువును పీఏబీఆర్ నీటితో నింపాలని కోరారు. చెరువు నిండితే 15 వేలు జనాభా కలిగిన బత్తలపల్లిలోని ప్రజలకు సాగునీరు, తాగునీటి కష్టాలు తప్పుతాయన్నారు. ఎస్ఈ రాజశేఖర్‌బాబు సాధ్యసాధ్యాలను పరిశీలించి కచ్చితంగా నీరు విడుదల చేయడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. రైతులు నెట్టెం రమణ, గడుపూటి రామానాయుడు, బొమ్మినేని వెంకటేష్, బోయపాటి రఘురామ్, ఆదెప్ప, బత్తల రాజా, గుండు సాబ్ పాల్గొన్నారు.

దాతలకు ఘన సన్మానం



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం: స్థానిక చెరువుకట్ట సమీపంలోనున్న కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో నిమ్మ నారాయణమ్మ, ఈశ్వరప్ప జ్ఞాపకార్థం కుమారులు నిమ్మ చంద్రశేఖర్, భార్య నాగమణి, కుమారుడు వినయ్‌సాయి షెడ్డును నిర్మించారు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు కైపా ద్వారకనాథ్‌శర్మ దాతలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

హైఓల్టేజ్‌తో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

పుట్టపర్తి రూరల్: ఎనుముపల్లిలో హైఓల్టేజ్‌తో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. మంగళవారం జెడ్పీహైస్కూల్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైర్‌పై ఫేస్‌వైర్ పడడంతో హైఓల్టేజ్ ప్రసారమైంది. గ్రామంలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు, లైట్లు, విద్యుత్ పరికరాలు, కాలిపోయాయి. 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విద్యుత్ అధికారులకు విన్నవించారు. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని ఏఈ నారాయణమ్మ హామీ ఇచ్చారు. సిబ్బందితో సమస్య పరిష్కరించారు.

'నీట్' పీజీలో ధర్మవరం విద్యార్థి ప్రతిభ

ధర్మవరం అర్బన్: నీట్ పీజీ ఫలితాల్లో పట్టణానికి చెందిన విద్యార్థి పచ్చా సాయి దుర్గాప్రసాద్ ప్రతిభ చాటాడు. పట్టణానికి చెందిన లయోలా పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వనజ దంపతుల కుమారుడు పచ్చాసాయి దుర్గాప్రసాద్ నీట్ పీజీలో స్టేట్ ర్యాంకు 1300 లభించింది. దీంతో ప్రభుత్వ కోటాలో నంద్యాల శాంతిరాం మెడికల్ కళాశాల పల్మనాలజీ విభాగంలో ఎండీ సీటు సాధించాడు.

ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు సమీపంలోనున్న ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై విద్యార్థి తండ్రి ఫిర్యాదు చేశాడు. బాధితులు వివరాల మేరకు.. పట్టణంలోని ఎరగుంటకు చెందిన రామకృష్ణ కుమారుడు ప్రజ్వలనంద రేగాటిపల్లి రూట్‌లోనున్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. పాఠశాల పక్కన చెత్తకుప్పకు ఎవరో నిప్పు పెట్టడంతో అక్కడ ఆడుకుంటున్న విద్యార్థి ప్రజ్వలనందను మరో విద్యార్థి ఆ మంటల్లోకి తోశాడు. ఈ ప్రమాదంలో విద్యార్థి మోకాలికి కాలిన గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విద్యార్థి తండ్రి రామకృష్ణ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలు తలెత్తకుండా తాగునీరు సరఫరా చేయాలి

తాడిమర్రి: మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తాగునీరు సరఫరా చేయాలని డీఆర్‌ఈఓ మల్లికార్జునప్ప సిబ్బందిని ఆదేశించారు. పెద్దకోట్ల వద్ద నిర్మించిన తాగునీటి సంపును మంగళవారం ఆయన డీఈ శాంతన్నతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తాగునీటి లభ్యత, నిల్వలపై తాగునీటి సరఫరా కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పెద్దకోట్లలో ఇంటింటా పర్యటిస్తూ తాగునీటి సరఫరా, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు స్పందించాలని ఆయన ఏఈ ఫమిద ఫర్వీన్‌ను ఆదేశించారు.

నిప్పుతో పంటలకు ముప్పు

నల్లమాడ: నిప్పుతో పంటలకు ముప్పు వాటిల్లితోందని నల్లమాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా నల్లమాడ పోలీస్ సర్కిల్ పరిధిలోని నల్లమాడ, ఓడీ చెరువు, అమడగూరు మండలాల్లో పలుచోట్ల నిప్పంటుకొని ఉలవ, ఇతర పంటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు, వ్యవసాయ సామగ్రి కాలిపోతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. మండలంలో పంట దిగుబడి కాలి బూడిదైన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.